క్లుప్తంగా

టీపీటీఎఫ్ మండల కమిటీ ఎన్నిక


పూసపల్లి మల్లయ్య


దారం నాగరాజు

అర్వపల్లి: టీపీటీఎఫ్ మండల నూతన కమిటీని అర్వపల్లిలో ఆదివారం ఎన్నుకున్నారు. మండల గౌరవ అధ్యక్షుడిగా దబ్బేటి యాదగిరి, అధ్యక్షుడిగా పూసపల్లి మల్లయ్య, ప్రధాన కార్యదర్శిగా దారం నాగరాజు, ఉపాధ్యక్షుడిగా వడ్లకొండ యాదగిరి, సహాయ కార్యదర్శిగా రాజుల భిక్షం , మహిళా కార్యదర్శిగా కుంభం రేణుక, కోశాధికారిగా కె.వరదాచార్యులు, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా చిత్తలూరి శ్రీరాములును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ ఎన్నికలో పరిశీలకుడు, జిల్లా ఉపాధ్యక్షుడు యోగాచార్య డాక్టర్ పగిళ్ల సైదులు, ఎన్నికల అధికారి చిప్పలపల్లి రవి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఓటు హక్కు నమోదు చేసుకోవాలి


వెలిశాలలో ఓటు నమోదు ప్రక్రియను పరిశీలిస్తున్న తహసీల్దార్ హరిప్రసాద్

తిరుమలగిరి (తుంగతుర్తి) : పద్దెనిమిది సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఓటు హక్కు నమోదు చేసుకోవాలని తిరుమలగిరి తహసీల్దార్ బి.హరిప్రసాద్ కోరారు. ఆది వారం ఓటు నమోదుపై ప్రత్యేక క్యాంపెయిన్ సందర్భంగా బండ్లపల్లి, గుండెపురి, వెలిశాలలో పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటు నమోదులో తప్పులు ఉన్నట్లయితే ఫారం–8 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

ముగిసిన ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాలు

అర్వపల్లి:18ఏళ్లు నిండిన యువతి, యువకులు నూతన ఓటర్లుగా నమోదు చేసుకోవడానికి మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో రెండు రోజులుగా జరుగుతున్న ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాలు ఆదివారంతో ముగిసాయి. చివరి రోజున అన్ని గ్రామాలలో దరఖాస్తులను బీఎల్ఓలు స్వీకరించారు. 18ఏళ్లు నిండిన యువతి, యువకులు నూతన ఓటరుగా నమోదు చేసుకోవడంతోపాటు మార్పులు, చేర్పులు అభ్యంతరాలకు దరఖాస్తులు చేశారు. ఈ ప్రత్యేక శిబిరాలను తహసీల్దార్ జక్కర్తి శ్రీనివాసులు సందర్శించారు. ఈ కార్యక్రమంలో గిర్దావర్‌లు, బీఎల్ఓలు పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు


గన్నెనాయక్‌తండాలో పశువులకు టీకాలు వేస్తున్న వైద్య సిబ్బంది

అర్వపల్లి: పశువులకు వ్యాధులు ప్రబలకుండా ముందస్తుగా టీకాలు వేయించాలని మండల పశు వైద్యాధికారి డాక్టర్ బి. అర్జున్ కోరారు. మండల పరిధిలోని గన్నెనాయక్, సూర్యనాయక్‌తండాలో ఆదివారం పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాల శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నల్ల, తెల్ల పశువులకు టీకాలను వేశారు. ఈ కార్యక్రమంలో వీఎల్‌వో కెఎస్ఎస్. పద్మ, యాకయ్య, ఓఎస్ మధుసూధన్, గోపాలమిత్రలు ఆల్థాస్ లింగయ్య, అర్జున్, రైతులు పాల్గొన్నారు.

పద్మశాలి సంఘం పట్టణ అధ్యక్షుడిగా సతీష్


సతీష్‌ను సన్మానిస్తున్న పద్మశాలి సంఘం నాయకులు

సూర్యాపేట టౌన్: పద్మశాలి సంఘం పట్టణ నూతన కమిటీని ఆదివారం స్థానిక శంకర్‌విలాస్ సెంటర్‌లోని మిట్టకోల భవన్‌లో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం సూర్యాపేట పట్టణ అధ్యక్షుడిగా మిట్టకోల సతీష్ కుమార్, ఉపాధ్యక్షుడిగా కోట వీరయ్య, జనరల్ సెక్రటరీగా రమేష్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా తలిశెట్టి శ్రీనివాస్, జాయింట్ సెక్రటరీగా వరకాల శ్రీనివాస్, కోజాయింట్ సెక్రటరీగా వరకాల ప్రవీన్, వైస్ ప్రెసిడెంట్‌గా గంజి శ్రీనివాసు, కోశాధికారులుగా మిట్టకోల మధు, వరకాల నవీన్, కార్యవర్గ సభ్యులుగా ఏలే ప్రభాకర్, రమేష్, మిట్టకోల కోటయ్య, మల్లికార్జున్, శ్రీకాంత్, కె.సరస్వతి, కొక్కుల సంపత్‌కుమార్, కొక్కుల శ్యామ్, సైదేశ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

వన మహోత్సవానికి కసరత్తు

- 11వ విడత నర్సరీల్లో మొక్కలు పెంచాలని అధికారుల ఆదేశాలు
- 29నర్సరీల్లో మొక్కల పెంపకం
- నర్సరీల్లోకి మట్టిని తరలించిన ఉపాధి అధికారులు


అన్నారంలో నర్సరీకి మట్టిని తోలుతున్న సిబ్బంది


నర్సరీకి స్థలాన్ని చదును చేయిస్తున్న అధికారులు

పెన్‌పహాడ్: వచ్చే ఏడాది మండలంలో మొక్కలు నాటేందుకు గ్రామీణాభివృద్ధి శాఖ ఇప్పటి నుంచే కసరత్తు మొదలు పెట్టింది. పదో విడత వనమహోత్సవాన్ని పూర్తి చేసిన అధికారులు 11వ విడతకు కావాల్సిన మొక్కలను పెంచడానికి చర్యలు చేపట్టింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న హరితహారం 11వ విడత కార్యక్రమానికి అవసరమైన మొక్కలను పెంచేందుకు నర్సరీలను సిద్ధం చేస్తున్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా వన్ విలేజ్ వన్ నర్సరీ పేరుతో ప్రతి గ్రామంలో మొక్కల పెంపకానికి నర్సరీలను పెంచుతున్నారు. మండలంలోని మొత్తం 29 గ్రామ పంచాయతీల్లో ఒక్కో గ్రామానికి 8 నుంచి 12 వేల మొక్కలను పెంచాలని నిర్ణయించారు.

లక్ష్యం 3.30లక్షల మొక్కలు

మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో 29 నర్సరీల్లో 3.30లక్షల మొక్కలను పెంచేందుకు అధికారులు లక్ష్యం నిర్దేశించారు. ఆయా నర్సరీల నిర్వాహణకు మొక్కల సామర్థ్యాన్ని బట్టి నిధులను కేటాయిస్తున్నారు. ఇప్పటికే నర్సరీల్లోకి ఎర్రమట్టి, నల్లమట్టిని సేకరించినట్లు అధికారులు తెలిపారు. మొక్కలను పెంచడానికి అవసరమైన పాలిథిన్ బ్యాగులను గ్రామీణాభివృద్ధి శాఖ ద్వారా సరఫరా చేస్తుందని తెలిపారు. వన సేవకులతో ఉపాధి కూలీలు బ్యాగ్ ఫిల్లింగ్ పనులు చేపడుతున్నారు. మొక్కలు సక్రమంగా ఎదిగే విధంగా ఉపాధి కూలీల ద్వారా నీటిని క్రమంగా అందించాలి.

ప్రత్యేకంగా తాటి, ఈత మొక్కలు

నర్సరీల్లో ఈసారి ప్రత్యేకంగా తాటి, ఈత మొక్కలను పెంచాలని భావిస్తున్నట్లు తెలిపారు. అదే విధంగా ప్రతి ఇంటికి మొక్కలు పంపిణీ చేసేందుకు నిమ్మ, మామిడి, కొబ్బరి మొక్కలను పెంచనున్నట్లు తెలిపారు.

నర్సరీలు సిద్ధం చేస్తున్నాం



వచ్చే ఏడాది మొక్కలు నాటే కార్యక్రమానికి అవసరమయ్యే మొక్కలను పెంచడానికి గ్రామాల్లోని ఉపాధి హామీ నర్సరీలను సిద్ధం చేస్తున్నాం. పాలిథిన్ బ్యాగులు రాగానే మట్టినింపి విత్తనాలు వేయాలి. మొక్కలు సక్రమంగా ఎదిగే విధంగా కూలీలు నీటిని సక్రమంగా అందించాలి.

– రవి ఏపీఓ

వైద్య విద్యార్థినికి ఆర్థిక చేయూత


నగదు అందజేస్తున్న మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్


ఆర్థికసాయం అందజేస్తున్న వెంపటి గ్రామస్తులు

తుంగతుర్తి: మండల పరిధిలోని వెంపటి గ్రామానికి చెందిన వైద్య విద్యార్థిని శిగ గౌతమి ఎంబీబీఎస్ సీటు సాధించి ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటుండటంతో ఆదివారం పలువురు ఆర్థిక చేయూత అందించారు. మాజీ ఎంపీ డాక్టర్ బూర నర్సయ్యగౌడ్ హైదరాబాద్‌లోని తన నివాసంలో విద్యార్థిని గౌతమికి రూ.20,000 ఆర్థిక సహాయం అందజేశారు. వెంపటి గ్రామస్తులు రూ.1,00,516, జీఎంఎస్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ.15,000 అందజేశారు. కార్యక్రమంలో వెంపటి గ్రామస్తులు తునికి మురళి, పొన్నం కిరణ్, గుండ్ల ఆంజనేయులు, రవీందర్, నరేష్, ప్రభాకర్, చిర్ర మహేష్, వెంకటేశ్వర్లు, మంజుల, గుండగాని మహేష్, గౌడ ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కాంపాటి రాధక్రిష్ణగౌడ్, బెల్లంకొండ రాంమూర్తిగౌడ్, చిత్తలూరి యాదగిరిగౌడ్, వెంకటేశ్వర్లుగౌడ్, వెంకటయ్యగౌడ్, వెంకన్నగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, సత్యనారాయణగౌడ్, అంజయ్యగౌడ్, మాజీ ఎంపీపీ గుండగాని కవితరాములుగౌడ్, వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బాప్టిస్టు చర్చి వార్షికోత్సవం

అర్వపల్లి: అర్వపల్లిలోని బాప్టిస్టు చర్చి 20వ వార్షికోత్సవాన్ని ఆదివారం చర్చి ఆవరణలో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్ధనలు చేసి కేక్ కట్ చేశారు. ఏసు ప్రభువును ప్రతి ఒక్కరూ మార్గదర్శకంగా తీసుకొని ఆయన చూపిన బాటలో పయనించాలని వక్తలు కోరారు. కార్యక్రమంలో వేల్పుల రమేష్, పాస్టర్లు ప్రభుదాస్,నెహామియ, డానియేలు, ఏసురత్నం తదితరులు పాల్గొన్నారు.

టాలెంట్ టెస్టులను సద్వినియోగం చేసుకోవాలి


సూర్యాపేటలో ప్రశ్నపత్రాలను ఆవిష్కరిస్తున్న విద్యాశాఖ అధికారులు


సదిశ గణిత ప్రతిభ పోటీ పరీక్షలకు హాజరైన విద్యార్థులు

సూర్యాపేట టౌన్: విద్యార్థులు టాలెంట్ టెస్టులను సద్వినియోగం చేసుకొని చదువులో ఉన్నత శిఖరాలు సాధించాలని సదిశ ఫౌండేషన్ డైరెక్టర్, తెలంగాణ గణిత ఫోరం జిల్లా ప్రధాన కార్యదర్శి దామల్ల కోటేశ్వరరావు, సూర్యాపేట జిల్లా సెక్టోరియల్ ఆఫీసర్ కందిబండ శ్రవణ్‌కుమార్ సూచించారు. ఆదివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు సదిశ గణిత ప్రతిభ పోటీ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సదిశ ఫౌండేషన్ ద్వారా విద్యార్థుల్లో ఉన్న ప్రతిభను వెలికితీయుటకు ఈ టాలెంట్ టెస్ట్‌లు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ఈ ప్రతిభ పోటీ పరీక్షలో సుమారుగా 800 మంది రిజిస్ట్రేషన్ చేసుకోగా వీరిలో 675 మంది హాజరైనారు. ఈ కార్యక్రమంలో జిల్లా సెక్టోరియల్ అధికారి దేవరశెట్టి జనార్దన్, డీసీబీ సెక్రెటరీ తుంగతుర్తి కళారాణి, సూర్యాపేట మండల విద్యాధికారి శ్రీనివాసగౌడ్, శ్లోక అకాడమీ చైర్మన్ మారం వెంకట్‌రెడ్డి, తెలంగాణ గణిత ఫోరం జిల్లా అధ్యక్షుడు ఎం,అశోక్, రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండా వెంకటేశ్వర్లు, ట్రెజరర్ మంచాల శ్యామ్, పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం అందజేత


సూర్యాపేటలో సదిశ గణిత ప్రతిభ పోటీ పరీక్షలకు హాజరైన విద్యార్థులు

నాగారం : మండల పరిధిలోని పసునూరు గ్రామానికి చెందిన చిత్తలూరి హరీష్ హైదరాబాద్‌లోని అబ్దుల్లాపూర్ మేట్‌లో పోలీస్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తూ ఇటీవల దసరా పండగకు స్వగ్రామానికి వచ్చి గుండెపోటుతో మరణించాడు. ఈ సందర్భంగా 2012 బ్యాచ్‌కు చెందిన కానిస్టేబల్ బృందం సభ్యులు తమ వంతు సాయంగా ఆదివారం సూర్యాపేటలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో మృతుడు హరీష్ భార్య ప్రియాంకకు రూ.2,55,500లు ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో 2012 కానిస్టేబుల్ బృందం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి


పరీక్షలు చేస్తున్న వైద్యులు

పెన్‌పహాడ్ : మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో హైదరాబాద్ నానక్రామ్‌గూడ శంకర కంటి ఆసుపత్రి కంచి కామకోటి మెడికల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కంటి శస్త్రచికిత్సలు అవసరం ఉన్న రోగులను ఆసుపత్రికి తరలించి ఆపరేషన్లు ఉచితంగా చేయనున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో ఆఫ్తామిక్ అసిస్టెంట్‌లు ఫెడ్రిక్, అమిత్, నిర్వాహకులు రాధేశ్యామ్, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం


ఆత్మీయ సమ్మేళనంలో ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

పెన్‌పహాడ్: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2003–04 బ్యాచ్‌కి చెందిన పదో తరగతి విద్యార్థులు ఆదివారం సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. పూర్వ విద్యార్థులు ఒకరినొకరు పరిచయం చేసుకొని తమ కష్ట సుఖాలను ఒకరునొకరు పొలుపంచుకున్నారు. అందరూ కలిసి మెలసి తమకు చదువు నేర్పిన గురువులను సన్మానించి ఆశీర్వాదం తీసుకున్నారు. అందరూ గ్రూప్ ఫోటోలు దిగారు. కార్యక్రమంలో ఎంఈఓ రవి, ఉపాధ్యాయులు సత్యనారాయణ, వెంకటరెడ్డి, శ్రవణ్‌కుమార్, ఝాన్సీ, లక్ష్మణచారి, మధు పాల్గొన్నారు.

నూతనకల్ : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1985–86 వార్షిక విద్యా సంవత్సరంలో పదో తరగతి విద్యనభ్యసించిన పూర్వ విద్యార్థులు ఆదివారం మండల పరిధిలోని గుండ్లసింగారంలోని ఐఎల్ఆర్ ఫంక్షన్ హాల్‌లో ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులు ఒకరికొకరు ఆప్యాయంగా పలకరించుకొని యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు సాబాది వెంకట్‌రెడ్డి, సీపీఎల్ ప్రసాద్, రామసాని మల్లారెడ్డి, బిక్కి గుర్వయ్య, అలీపురం దామోదర్‌రెడ్డి, ఎండీ మహిమూద్, దాసోజు ప్రభాకరచారి, రజాక్ పాల్గొన్నారు.


ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

తప్పులు లేకుండా సర్వే నిర్వహించాలి


సింగారెడ్డిపాలెంలో సర్వే ప్రక్రియను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ రాంబాబు


అర్వపల్లిలో సర్వేను పరిశీలిస్తున్న తహసీల్దార్

సూర్యాపేట : సూర్యాపేట పట్టణంలో జరుగుతున్న సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ మరియు కుల సర్వే సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేకు పట్టణ ప్రజలు సహకరించి ఎన్యుమరేటర్లకు పూర్తి సమాచారం అందించాలని మున్సిపల్ కమిషనర్ బి. శ్రీనివాస్ అన్నారు. ఆదివారం పట్టణంలోని వివిధ వార్డుల్లో 39వ వార్డులో జరుగుతున్న సర్వేను పరిశీలించి ఎన్యుమరేటర్లకు తగు సూచనలు సలహాలు అందించారు. 39వ వార్డు కౌన్సిలర్ మొరిశెట్టి సుధారాణిశ్రీనివాస్ తమ వార్డులో జరుగుతున్న సర్వేను ఇంటింటికి కమిషనర్‌తో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో మున్సిపల్ శానిటరీ ఇన్స్‌పెక్టర్ సారగండ్ల శ్రీనివాస్, డీలింగ్ అసిస్టెంట్ గోపారపు రాజు, ఎన్యూమరేటర్లు, మాజీ కౌన్సిలర్ మొరిశెట్టి శ్రీను పాల్గొన్నారు.

తిరుమలగిరి (తుంగతుర్తి) : ఎన్యుమరేటర్లు తప్పులు లేకుండా సర్వే చేయాలని తిరుమలగిరి తహసీల్దార్ హరిప్రసాద్ కోరారు. ఆదివారం మండలంలో జరుగుతున్న సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ కుల సర్వేను పరిశీలించారు. మండలంలో ఈ సర్వేకు 62 మంది ఎన్యుమరేటర్లు, ఆరుగురు సూపర్‌వైజర్లు, 12 మంది కంప్యూటర్ ఆపరేటర్లు పాల్గొంటున్నట్లు తెలిపారు.

సర్వేను విజయవంతం చేయాలి

తిరుమలగిరి (తుంగతుర్తి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన బీసీ కుల గణన సర్వేను విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎల్సోజు నరేష్ కోరారు. ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ దేశంలోనే మొట్ట మొదటి సారిగా సర్వే జరుగుతుందని, ఈ సర్వేను విజయవంతం చేయడానికి కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ జమ్మిలాల్, పట్టణ అధ్యక్షులు పేరాల వీరేష్ పాల్గొన్నారు.

సర్వేకు ప్రజలు సహకరించాలి

నాగారం : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వేలో ఎన్యూమరేటర్లకు ప్రజలు సహకరించాలని స్థానిక ఎంపీడీఓ మారయ్య అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో కుల గణన సర్వేను పరిశీలించి మాట్లాడారు. ఎన్యుమరేటర్లు సమగ్ర సర్వేను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. ఈ సర్వేలో 56 అంశాలు ఉంటాయని, సర్వేలో కుటుంబ సభ్యుల వివరాలను సేకరించి నమోదు చేయాలన్నారు. సర్వేలో ఏలాంటి పొరపాట్లు జరగకుండా అధికారులు తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. సర్వే వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని అన్నారు. కార్యక్రమంలో ఎంపీఎస్ఓ చింతమల్ల రమేష్, ఎన్యూమరేటర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

నిబంధనల ప్రకారం సర్వే నిర్వహించాలి

అర్వపల్లి: రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వేను నిబంధనల ప్రకారం ఎన్యుమరేటర్లు నిర్వహించాలని తహసీల్దార్ జక్కర్తి శ్రీనివాసులు కోరారు. అర్వపల్లితోపాటు వివిధ గ్రామాల్లో కుటుంబ సమగ్ర సర్వేను ఆదివారం పరిశీలించారు. మండల వ్యాప్తంగా 82 మంది ఎన్యుమరేటర్లు సర్వే చేస్తున్నారని చెప్పారు.

పారదర్శకంగా సర్వే చేపట్టాలి

పెన్‌పహాడ్: సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను పారదర్శకంగా, నిబద్ధతతో చేపట్టాలని అదనపు కలెక్టర్ రాంబాబు అన్నారు. పెన్‌పహాడ్ మండల సింగారెడ్డిపాలెంలో కొనసాగుతున్న సర్వే ప్రక్రియతోపాటు ఐకేపీ కొనుగోలు, పోలింగ్ కేంద్రాలను ఆదివారం అదనపు కలెక్టర్ పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ లాలు, ఆర్ఐ రంజిత్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి అఖిల్, ఐకేపీ నిర్వాహకులు పాల్గొన్నారు.

తప్పిదాలు లేకుండా వివరాలు నమోదు చేయాలి

నూతనకల్: సమగ్ర కుటుంబ సర్వేలో తప్పిదాలకు అవకాశం లేకుండా ఎన్యుమరేటర్లు కృషి చేయాలని తహసీల్దార్ గశ్రీనివాసరావు అన్నారు. ఆదివారం మండల పరిధిలోని ఎర్రపహాడ్‌లో బ్లాక్ నెంబర్ 46, 52లో సర్వేను పరిశీలించారు. అనంతరం గ్రామంలోని ధాన్యం కొనుగోళు కేంద్రాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

అర్వపల్లి దేవాలయంలో కార్తీక మాస వేడుకలు


ఆకాశదీపం వెలిగిస్తున్న అర్చకుడు

అర్వపల్లి: కార్తీక మాసాన్ని పురస్కరించుకొని అర్వపల్లిలోని శ్రీయోగానంద లక్ష్మీనర్సింహస్వామి దేవాలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే ధ్వజస్తంభానికి ఆకాశదీపాన్ని వెలిగించారు. ఈ సందర్భంగా దేవాలయంలో 27 నక్షత్రాలతో నక్షత్ర నీరాజన కార్యక్రమాన్ని అర్చకులు జరిపారు. సహస్ర నామార్చన, విశేషార్చన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు అర్వపల్లి రాంబాబుఅయ్యంగార్, పవన్‌కుమార్, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

శైవక్షేత్ర వనితాశక్తి ఆధ్వర్యంలో పారాయణం


అర్వపల్లి దేవాలయంలో పారాయణం చేస్తున్న శ్రీ శైవక్షేత్ర వనితాశక్తి సభ్యులు

అర్వపల్లి: ధర్మో రక్షితి రక్షిత ట్రస్ట్ ఆధ్వర్యంలో శ్రీ శైవక్షేత్ర వనితాశక్తి ఇంటర్నేషనల్ తిరుమలగిరి గ్రూప్–2 మహిళలు అర్వపల్లిలోని శ్రీయోగానంద లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో శ్రీ శైవక్షేత్ర పీఠాధిపతి, హిందూధర్మ పరిరక్షకుడు శివస్వామిజి జన్మదినం సందర్భంగా నర్సింహస్వామికి అర్చన, అమ్మవార్లు శ్రీదేవి, భూదేవిలకు వడిబియ్యం సమర్పన కార్యక్రమాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు పారాయణం కార్యక్రమాన్ని నిర్వహించారు.కార్యక్రమంలో అధ్యక్షురాలు దుద్దిళ్ల అంజమ్మ, కార్యదర్శి బుక్క జ్యోతి, కోశాధికారి బుక్క స్వాతి పాల్గొన్నారు.

స్వచ్ఛందంగా మంచినీటి ట్యాంక్ నిర్మాణం

అర్వపల్లి: అర్వపల్లిలోని శ్రీయోగానంద లక్ష్మీనర్సింహస్వామి దేవాలయంలో నెలకొన్న నీటి సమస్యను పరిష్కరించిందేకు రేఖ చారిటబుల్ ఫౌండేషన్ కృషిచేస్తుంది. అందులో భాగంగా ఇప్పటికే దేవాలయంలో బోరువేసి మోటార్ బిగించారు. అలాగే మినీట్యాంక్ నిర్మాణ పనులు కూడా ఆదివారం ప్రారంభించారు. ట్యాంక్ నిర్మాణం చేపట్టి బోరు నీటిని ట్యాంక్‌కు కనెక్షన్ ఇచ్చి నిరంతరం భక్తులకు నీళ్లు అందుబాటులో ఉండేలా చూడనున్నట్లు ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు, జాతీయ టెన్నిస్ క్రీడాకారిణి డాక్టర్ బోయలపల్లి రేఖ తెలిపారు.

బీఆర్ఎస్ నాయకుడికి ఘన నివాళి

ఆత్మకూర్(ఎస్)(సూర్యాపేట) : బీఆర్ఎస్ జిల్లా నాయకులు గంగరబోయిన వెంకన్న(జీకే) నాలుగో వర్ధంతి సందర్భంగా అతని సమాధి వద్ద మాజీ జెడ్పీటీసీ జీడిభిక్షం తదితరులు ఆదివారం కొవ్వొత్తి వెలిగించి శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో నెమ్మికలు గ్రామ మాజీ ఉపసర్పంచ్ ఎడవెల్లి ముత్తయ్య, వేల్పుల వెంకన్న ,పేరం బాలస్వామి, కత్తి వెంకటేశ్వర్లు, రాజు, గంగారబోయిన శ్రీనివాస్, గంగారబోయిన రవి పాల్గొన్నారు.

ఉర్సుకు ఏర్పాట్లు ఎప్పుడో?


అర్వపల్లి శివారులోని గుట్టల మధ్య ఉన్న దర్గా


దర్గా వద్ద నిరుపయోగంగా ఉన్న మరుగు దొడ్లు

- ఈనెల 29 నుంచి అర్వపల్లి హజ్రత్ ఖాజానసీరుద్దీన్ బాబా దర్గా ఉర్సు
- దర్గా వద్ద కొరవడిన కనీస వసతులు
- నిరుపయోగంగా మరుగుదొడ్లు
- ఇంతవరకు బీటీకి నోచుకోని రోడ్డు

అర్వపల్లి: మతసామరస్యానికి ప్రతీకగా నిలిచి రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు తరలివచ్చే అర్వపల్లి శివారులోని హజ్రత్ ఖాజానసీరుద్దీన్ బాబాదర్గా ఎలాంటి అభివృద్ధికి నోచుకోవడం లేదు. ఈ దర్గాకు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివస్తారు. అయితే ఈ దర్గా ఉర్సు ఏడాదికోసారి ఘనంగా జరుగుతుంది. అందులో భాగంగానే ఈ సారి ఈనెల 29, 30 తేదీలలో రెండు రోజుల పాటు ఉత్సవాలు జరుగనున్నాయి. ఉర్సుకు మరో 20 రోజులు మాత్రమే సమయం ఉంది. కానీ వక్ఫ్‌బోర్డు ఇంతవరకు ఉర్సుకు సంబంధించి ఎలాంటి ఏర్పాట్లు చేపట్టలేదు. దర్గాకు రంగులు వేయడానికి కనీసం 10 రోజుల సమయం పడుతుంది. అలాగే ఇతర ఏర్పాట్లు కూడా ప్రారంభించలేదు

కొరవడిన వసతులు : దర్గా వద్ద కనీస వసతులు కొరవడ్డాయి. 365 హైవే నుంచి దర్గాకు కిలోమీటరున్నర దూరం ఉంటుంది. ఈ రోడ్డు పూర్తిగా ఫార్మేషన్ రోడ్డే. ఈ రోడ్డుపై గుంతలు పడి అధ్వానంగా ఉంది. అలాగే ప్రతిసారి ఉర్సు సందర్భంగా తాత్కాలిక రోడ్డుకుఇంకా మరమ్మతు పనులు మొదలు కాలేదు. అలాగే దర్గా వద్ద మరుగుదొడ్లు నిర్వహణలేక శిథిలమై నిరుపయోగంగా ఉన్నాయి. దర్గా పరిసరాలు చెత్తకుప్పలు, కంప, పిచ్చిమొక్కలతో నిండి ఉన్నాయి. వీటిని తొలగించి శుభ్రం చేయించాల్సి ఉంది. అలాగే దర్గా వద్ద షాదీఖాన నిర్మాణం కొన్నేళ్లుగా అసంపూర్తిగా నిలిచిపోయింది. కాగా దర్గా వద్ద దుకాణాల వేలం పాట ద్వారా ప్రతి ఏటా రూ.20 లక్షలకు పైగానే ఆదాయం వస్తున్నా ఇక్కడ ఎలాంటి వసతులు కల్పించడం లేదని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వసతులు కల్పించాలి



దర్గా వద్ద ఎలాంటి వసతులు లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కనీసం రావడానికి రోడ్డు సౌకర్యం కూడా సరిగా లేదు. మరుగుదొడ్లు కూడా శిథిలమయ్యాయి. ఏ వసతులు లేక దర్గాకు వచ్చే భక్తులు అవస్థల పాలవుతున్నారు.

– హుస్సేన్, భక్తుడు సూర్యాపేట

సత్రాలు నిర్మించాలి



ఎంతో దూరం నుంచి వచ్చే భక్తులకు కనీసం విశ్రాంతి తీసుకోవడానికి సత్రాలు కూడా లేవు. ప్రస్తుతం ఉన్న సత్రం శిథిలమైంది. నీటి వసతి కూడా సరిగా లేదు. ఫార్మేషన్ రోడ్డును బీటీగా మార్చాలి.

– సయ్యద్ బాబా, భక్తుడు హైదరాబాద్